ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట

- ఎమ్మెల్యే శంకరనారాయణ,
- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక



సోమందేపల్లి: కళ్లద్దాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శంకరనారాయణ



చిలమత్తూరు: వృద్ధుడికి కళ్లద్దాలు అందజేస్తున్న సమన్వయకర్త దీపిక

సోమందేపల్లి: ప్రజలు ఆరోగ్యవంతమైన జీవనాన్ని గడపాలన్న దృఢ సంకల్పంతోనే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం తీసుకొచ్చిందని ఎమ్మెల్యే మాలగుండ్ల శంకర నారాయణ తెలిపారు. మండలంలోని మేకలపల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎమ్మెల్యే మంగళవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో చేయని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో వైద్య రంగానికి ఎంతో ప్రాధన్యత ఇస్తున్నట్లు చెప్పారు. గ్రామాల వద్దకే వైద్యులు వెళ్లి చికిత్సలు అందిస్తున్నారన్నారు. ఉచితంగా మందులు, శస్త్ర చికిత్సలు చేస్తూ పేదల ఆరోగ్యానికి భరోసా ఇస్తున్నారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పరందామ, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నారాయణరెడ్డి, మాజీ కన్వీనర్ వెంకటరత్నం, కో ఆప్షన్ సభ్యుడు రఫీక్ తదితరులు పాల్గొన్నారు.

చిలమత్తూరు: ప్రజారోగ్యానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద పీట వేస్తున్నారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక అన్నారు. మంగళవారం కోడూరు థామస్ మన్రో తోపులోని జెడ్పీహెచ్ఎస్‌లో నిర్వహించిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు..ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా పేద ప్రజలకు ఎంతో మేలు చేకూరుతోందన్నారు. అనంతరం ఆమె పౌష్టికాహార స్టాల్స్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీపీ పురుషోత్తమరెడ్డి, తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీఓ నరేష్‌కృష్ణ, సర్పంచులు మురళి, తిరుమలేష్, శంకర్ రెడ్డి, నీలీబాయి, వైస్ ఎంపీపీలు అంజలీదేవి, బయప్ప, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మడకశిరరూరల్/అగళి: మడకశిర మండలంలోని భక్తరహళ్లి, అగళి మండలం నరసంబుది గ్రామాల్లో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎస్‌వీ కృష్ణారెడ్డి సందర్శించారు. వైద్య శిబిరం ద్వారా ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలను పర్యవేక్షించారు. వైద్య సిబ్బంది వైద్య చికిత్సలు ఎలా అందిస్తున్నారని ఆరా తీశారు.

హిందూపురం: మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ అధ్యక్షతన 16వ వార్డులో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ శిబిరాన్ని సందర్శించారు.

పరిగి: మండలంలోని శ్రీరంగరాజుపల్లిలో ఎంపీడీఓ సరస్వతి ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. దాదాపు 400కు పైగా ఓపీ బుక్ లెట్లను అందించినట్లు అధికారులు తెలిపారు.

లేపాక్షి: మండలంలోని మైదుగోళం ప్రాథమికోన్నత పాఠశాలలో మండల స్పెషల్ ఆఫీసర్ సుదర్శన్ ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరిగింది.

గోరంట్ల: మండలంలోని వడిగేపల్లిలో ఆరోగ్య సురక్ష కార్యక్రమం డీపీఓ విజయకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా వైద్యులు స్థానికులకు వివిధ పరీక్షలు చేసి మందులు అందించారు.

రొద్దం: మండల పరిధిలోని నల్లూరు ప్రాథమిక పాఠశాల ఆవరణలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు.

గుడిబండ: మండల పరిధిలోని రాళ్లపల్లి సచివాలయం ఆవరణలో జగనన్న ఆరోగ్య సురక్ష పై వైద్య శిబిరాన్ని నిర్వహించారు. డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ మంజువాణి శిబిరాన్ని పరిశీలించారు.

అమరాపురం: మండలంలోని కెంకెర గ్రామంలో ఎంపీడీఓ మునిస్వామి, ఎంపీపీ ఈరన్న ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు.

రొళ్ల: మండల పరిధిలోని హులికుంట సచివాలయం ఆవరణలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఎంపీపీ కవిత, జెడ్పీటీసీ అనంతరాజు శిబిరాన్ని పర్యవేక్షించారు.

అశ్రు నయనాల మధ్య జవాన్ అంత్యక్రియలు



సురేశ్ భౌతిక కాయానికి సెల్యూట్ చేస్తున్న తహసీల్దార్ వరదరాజు

పావగడ: పంజాబ్ రాష్ట్రంలోని చండీఘడ్‌లో బీఎస్ఎఫ్ జవాన్‌గా పనిచేస్తూ మృతి చెందిన సురేష్‌కుమార్ అంత్యక్రియలు మంగళవారం ముగిశాయి. చండీఘడ్ నుంచి శ్రీరంగాపురానికి సోమవారం రాత్రి సురేష్ భౌతికకాయం చేరుకుంది. మంగళవారం ఉదయం తహసీల్దార్ వరదరాజు ఆధ్వర్యంలో అధికార లాంఛనాలతో కుటుంబ సభ్యులు, గ్రామస్తుల అశ్రు నయనాల మధ్య సురేశ్ భౌతిక కాయానికి అంత్య క్రియలు జరిగాయి. మృతుడి భార్య వెన్నెల తన ఇద్దరు చంటి పిల్లల్ని పట్టుకుని మాకింక దిక్కెవరు దేవుడా అని రోదించిన తీరు అందరి కంట కన్నీరు పెట్టించింది. తమ తలకు కొరివి పెట్టాల్సిన పెద్ద కుమారుడికి తామే కొరివి పెట్టాల్సిన గతి పట్టిందంటూ తల్లిదండ్రులు జయరామరెడ్డి, సుధమ్మ గుండెలవిసేలా ఏడ్చారు. వారిని ఓదార్చడం ఎవరి తరమూ కాలేదు.

డ్రగ్స్ అనర్థాలపై అవగాహన

హిందూపురం: మత్తు పదార్థాలకు బానిస అయితే జీవితాలు నాశనం అవడంతో పాటు జీవితాలు రోడ్డున పడతాయని సెబ్ రాష్ట్ర జాయింట్ కమిషనర్ టి. నాగలక్ష్మి , సెబ్ సూపరింటెండెంట్ రవికుమార్ అన్నారు. మంగళవారం హిందూపురంలోని సప్తగిరి డిగ్రీ కళాశాలలో డ్రగ్స్ అనర్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు సూచనలు, సలహాలిచ్చారు.

క్లుప్తంగా

పాలీహౌస్ ధ్వంసం



హునిసేకుంటలో ధ్వంసమైన పాలీహౌస్

రొళ్ల: మండల పరిధిలోని హునిసేకుంటలో రైతు మంజునాథ్ చెందిన పాలీహౌస్‌ను సోమవారం రాత్రి దుండగులు ధ్వంసం చేశారు. విత్తనాలకై పాలీహౌస్ ఏర్పాటు చేసి కాకర సాగు చేశానని, పంట ఆశాజనకంగా ఉన్న సమయంలో దుండగులు పాలీహౌస్‌ను ధ్వంసం చేశారని బాధిత రైతు వాపోయారు. రూ.60 వేల నష్టంతో పాటు పంటకు కూడా నష్టం జరిగిందన్నారు.ఈ ఘటనపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పారు.

గోమాంసం విక్రయశాలలను తరలించండి



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

హిందూపురం టౌన్: పట్టణంలోని ముఖ్యకూడళ్లలో అక్రమంగా నిర్వహిస్తున్న గోవధ శాలలు, గోమాంస విక్రయ శాలలను పట్టణానికి దూరంగా తరలించాలని విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ నాయకులు కోరారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా కోశాధికారి జనార్ధన్, జిల్లా విశేష సంపర్క ప్రముఖ్ నాగరాజు ప్రసాద్, బజరంగదళ్ జిల్లా బలోపాసన కేంద్ర ప్రముఖ్ ఆదిత్య శ్రీనివాస్, మాధవ తదితరులు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్‌కు స్థలాన్ని కేటాయించాలి



తహసీల్దార్‌ను కలసిన జెడ్పీటీసీ అనంతరాజు

రొళ్ల: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం టీటీడీ కళ్యాణ మంటపం, విద్యుత్ సబ్‌స్టేషన్‌కు స్థలాన్ని కేటాయించాలని జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజు తహసీల్దార్ హసీనాసుల్తానాను కోరారు. ఎమ్మెల్యే తిప్పేస్వామి రొళ్ల మండలానికి టీటీడీ కళ్యాణ మంటపం నిర్మాణానికి అవసరమైన నిధులు కేటాయించడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారన్నారు. అలాగే దొడ్డేరి పంచాయతీలో నెలకొన్న లోఓల్టేజీ సమస్యను పరిష్కరించడానికి కొత్తగా విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరైందన్నారు. ఇందులో భాగంగానే టీటీడీ కళ్యాణ మంటపంతో పాటు విద్యుత్ సబ్‌స్టేషన్‌కు అవసరమైన స్థలాన్ని కేటాయించాలని తహసీల్దార్‌ను కోరారు. అవసరమైన స్థలాన్ని సర్వే చేయించి అందించడానికి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హామీ ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహారెడ్డి, కాకి వైస్ సర్పంచ్ రాజు పాల్గొన్నారు.

బుద్ధి మాంద్యుడి చేతిలో వ్యక్తి దారుణ హత్య



హతుడు శంకరప్ప



నిందితుడు అనిల్

పావగడ: పట్టణంలోని శని మహాత్మ సర్కిల్ వద్ద ఉన్న స్వాగత్ హోటల్ ఎదుట అనిల్ అనే బుద్ధిమాంద్యుడు శంకరప్ప అనే హమాలిని హత్య చేశాడు. పట్టణ సీఐ సురేష్ వివరాలమేరకు... చికెన్ తీసుకురాలేదన్న కోపంతో ఐదేళ్ల క్రితం అనిల్ తన తండ్రిని రాయితో మోది చంపేశాడు. రెండేళ్ల జైలు శిక్ష తర్వాత విడుదలై పావగడ వచ్చాడు. అప్పటి నుంచి అనిల్ పట్టణంలో ఎవరితోనూ మాట్లాడక పిచ్చివాడిలా తిరుగుతుండేవాడు. ఈ నేపథ్యంలో శివశంకరప్ప అనే హమాలి సోమవారం రాత్రి శని మహాత్మ సర్కిల్ వద్ద ఉన్న అంగళ్ల సముదాయం ఎదుట నిద్రపోతూ ఉన్నాడు. ఈ సమయంలో నిందితుడు తన వద్ద ఉన్న కర్రతో శంకరప్పపై దాడి చేయడంతో అక్కడికక్కడే అతను చనిపోయాడు. అనిల్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

అన్నపూర్ణేశ్వరీ నమోస్తుతే !

సాక్షిబృందం: నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లోని అన్ని ప్రాంతాల్లోని ఆలయాల్లో మంగళవారం వివిధ రూపాల్లో అమ్మవార్లు దర్శనమిచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.



చిలమత్తూరు: అన్నపూర్ణేశ్వరిగా చౌడేశ్వరీదేవి



హిందూపురం: వెండి చీర అలంకరణలో జలదుర్గాదేవి



పరిగి: అక్షింతల అలంకరణలో కాళికామాత



గోరంట్ల: స్వర్ణగౌరి అలంకరణలో మల్లాలమ్మ



పెనుకొండ: అన్నపూర్ణేశ్వరిగా వాసవీమాత



రొళ్ల: అన్నపూర్ణాదేవిగా మహాలక్ష్మీదేవి



అమరాపురం: లక్ష్మీవేంకటేశ్వరస్వామి



గుడిబండ: తుమ్మల మారెమ్మ



లేపాక్షి: అన్నపూర్ణేశ్వరిగా దుర్గాదేవి

15 రోజుల్లోపు ఇళ్ల పట్టాల పంపిణీ

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక



దీపికకు మెమొంటో అందిస్తున్న అర్చకులు

చిలమత్తూరు: 15 రోజుల్లోపు అర్హులైన లబ్ధిదారులకు ఇంటి పట్టాలు పంపిణీ చేస్తామని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక తెలిపారు. మంగళవారం ఆమె కోడూరు థామస్ మన్రోతోపులో విలేకరులతో మాట్లాడారు. కొద్దిరోజులుగా లబ్ధిదారులు ఇంటి పట్టాల కోసం ఆందోళన చేస్తున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా దీపిక మాట్లాడుతూ కోడూరు వద్ద స్థలాన్ని ఇప్పటికే గుర్తించామని, వెంటనే మండల పరిషత్ నిధులను వినియోగించి లేఔట్‌లో అంతర్గత రహదారులు, ఇతరత్రా పనులను మొదలు పెడతామన్నారు. లక్షలాది మంది పేదలకు ఇంటి పట్టాలను మంజూరు చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌కే దక్కుతుందన్నారు. అర్హత ఉన్నవారికి తప్పక ఇస్తామని, ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు. అవసరమైతే భూమి కొనుగోలు చేసి అయినా పంపిణీ చేస్తామని స్పష్టం చేశారు. ఎంపీపీ పురుషోత్తమరెడ్డి, స్థానిక నేతలు, అధికారులు పాల్గొన్నారు.

వీరభద్రుని సేవలో దీపిక

లేపాక్షి: ప్రసిద్ధి చెందిన వీరభద్రస్వామి దేవాలయాన్ని మంగళవారం ఉదయం హిందూపురం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక సందర్శించారు. ఈ సందర్భంగా దుర్గాదేవి, వీరభద్రస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవదాయశాఖ ఆధ్వర్యంలో ఆమెను శాలువతో సత్కరించి మెమొంటోను అందజేశారు.

అవన్నీ నిరాధార ఆరోపణలు



మాట్లాడుతున్న తహసీల్దారు సౌజన్యలక్ష్మి

పరిగి: మండల రెవెన్యూశాఖ ఉద్యోగులపై నాలుగు రోజులక్రితం అజ్ఞాత వ్యక్తి విడుదల చేసిన ఆకాశ రామన్న ఉత్తరాలపై తహసీల్దారు సౌజన్యలక్ష్మీ స్పందించారు. రెవెన్యూశాఖ ఉద్యోగులు, గ్రామ సచివాలయ సర్వేయర్లు, వీఆర్వోలపై వచ్చిన అవినీతి ఆరోపణలన్నీ అవాస్తవమేనని స్పష్టం చేశారు. మంగళవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ సౌజన్యలక్ష్మీ విలేకరులతో మాట్లాడారు. నిరాధారణ ఆరోపణలతో కొంతమంది కార్యాలయ ఉద్యోగులతో పాటూ తనపై అవాస్తవాలను దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. గతంలో పని చేసిన ఓ వీఆర్వో అవినీతి అక్రమాలకు పాల్పడటంతో సబ్‌కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని, దీంతో తమపై కక్ష గట్టి ఇలా చేస్తున్నారని ఆరోపించారు. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులను పూర్తిస్థాయిలో నివేదిక అందజేస్తామన్నారు. ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు వీబీ భాస్కర్‌రెడ్డి, పెనుకొండ తాలూకా అధ్యక్షుడు అబ్దుల్‌ఖాదర్, వైస్ ప్రెసిడెంట్ మహమ్మద్ సల్మాన్, ఆర్ఐలు మురళి, సిద్దేశ్వర్, మండల వీఆర్వో సంఘం అధ్యక్షుడు నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణదేవరాయలకు ఘన నివాళి



శ్రీకృష్ణదేవరాయుల విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

గోరంట్ల: విజయనగర సామ్రాజ్యాధీశుడు శ్రీకృష్ణదేవ రాయుల 494వ వర్ధంతిని నిర్వహించారు. చరిత్ర పరిశోధకుడు మైనాస్వామి ఆధ్వర్యంలో మంగళవారం గోరంట్లలోని స్థానిక విజయనగరకాలనీ సమీపంలోని శ్రీకృష్ణ దేవరాయుల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణదేవరాయులు చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో గోరంట్ల సహకార సంఘం మాజీ సీఈఓ చెన్నకేశవరెడ్డి, ఉపాధ్యాయులు లక్ష్మీపతి, నాగేంద్ర, శివప్ప, విష్ణువర్ధనరెడ్డి, జయరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ: పట్టణంలోని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శ్రీకృష్ణదేవరాయల వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో చరిత్ర అధ్యాపకులు ప్రతాప్ మాట్లాడుతూ శ్రీకృష్ణదేవరాయల హయాంలో అనేక చెరువులు, కుంటలు తవ్వించి భావితరాలకు ఎంతో ప్రయోజనం చేకూర్చారన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు దేవి శెట్టి రామన్న తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



నాగరాజప్ప (ఫైల్)

రొళ్ల: కర్ణాటక రాష్ట్రం మధుగిరి తాలూకా జడగొండనహళ్లి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన నాగరాజప్ప (55) చికిత్స పొందుతూ మృతి చెందారు. రొళ్ల మండలం జీఎస్ పాళ్యం గ్రామానికి చెందిన పౌరాణిక నాటిక ప్రదర్శన మాస్టర్ నాగరాజప్ప పని నిమిత్తం సోమవారం మధ్యాహ్నం మధుగిరికి ద్విచక్ర వాహనంలో వెళ్లారు. తిరిగి వస్తుండగా జడగొండనహళ్లి సమీపంలో ఓ యువకుడు ద్విచక్ర వాహనంలో ఎదురుగా వచ్చి నాగరాజప్ప బైక్‌ను ఢీకొట్టాడు. తుమకూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి చనిపోయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

యాజమాన్య పద్ధతులపై అవగాహన



మాట్లాడుతున్న ఉపసంచాలకులు పెంచలయ్య

లేపాక్షి: గొర్రెల పెంపకం చేపట్టే రైతులు లాభాదాయకమైన, మేలు రకమైన గొర్రెలు పెంచుకోవాలని, మందలో జాతి లక్షణాలు కలిగిన విత్తన పొట్టేళ్లు ఉండేలా చూసుకోవాలని హిందూపురం డివిజనల్ ఉప సంచాలకులు పెంచలయ్య రైతులకు సూచించారు. మంగవారం ఉదయం స్థానిక వైకేపీ కార్యాలయం వద్ద గొర్రెల పెంపకంలో మేలైన యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. పెంచలయ్య మాట్లాడుతూ వ్యాధిబారిన జీవాలను మంద నుంచి వేరు చేసి చికిత్స అందించడం ద్వారా గొర్రెల మరణాల శాతం తగ్గించవచ్చన్నారు. ప్యాపిలి గొర్రెల పెంపకందారుల శిక్షణ కేంద్రం అసిస్టెంట్ డైరెక్టర్, మాస్టర్ ట్రైనర్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ గొర్రెల్లో పారుడు, గాలికుంటు, చిటుక , బొబ్బ , నీలి నాలుక, ఆంత్రాక్స్, బ్రూసెల్లోసిస్ తదితర వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన చికిత్సను తెలియజేశారు. కార్యక్రమంలో స్థానిక అసిస్టెంట్ డైరెక్టర్ వి.మోహన్‌రావు, పశువైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై నిర్మాణాల తొలగింపు

హిందూపురం: పట్టణంలోని 30వార్డు న్యూహస్నాబాద్ ప్రాంతంలో అనాధికారంగా రోడ్డుపై వరకు నిర్మించిన నిర్మాణాలను కౌన్సిలర్ ఆసీఫ్‌వుల్లా ఆధ్వర్యంలో తొలగింపు చర్యలు చేపట్టారు. రోడ్డుపై వరకూ బాత్‌రూంలు, కట్టలు నిర్మించడంతో రాకపోకలకు ఇబ్బంది పడుతున్నట్లు మున్సిపల్ కమిషనర్‌కు స్థానికులు ఫిర్యాదు చేయడంతో చర్యలకు ఉపక్రమించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

అగళి: కర్ణాటక రాష్ట్రం నుంచి అక్రమంగా మద్యాన్ని తీసుకొచ్చి విక్రయిస్తున్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ లావణ్య తెలిపారు. మధుడికి చెందిన నరసింహమూర్తి నుంచి 110 ప్యాకెట్లు, ఇరేగెపల్లికి చెందిన నింగప్ప నుంచి 53 ప్యాకెట్లు, ఎ'ుత్తేపల్లికి చెందిన లోకేష్ నుంచి 20 ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. మద్యాన్ని అక్రమంగా తరలించినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

మద్యం విక్రేత అరెస్ట్

పెనుకొండ రూరల్: మండలంలోని శెట్టిపల్లికి చెందిన దూదేకుల బాషా అనే వ్యక్తి కర్ణాటక మద్యం విక్రయిస్తుండగా అదుపులోకి తీసుకున్నట్లు సెబ్ సీఐ వెంకటసుబ్బారెడ్డి తెలిపారు. 28 ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నామన్నారు.

పోస్టర్ల విడుదల

మడకశిర: ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న వివిధ రకాల ఆర్థిక బకాయిలను ప్రభుత్వం చెల్లించాలని డిమాండ్ చేస్తూ జిల్లా కేంద్రంలో ఎస్టీయూ ఆధ్వర్యంలో ఈనెల 20, 21న చేపట్టనున్న ఆక్రందన దీక్షలను విజయవంతం చేయాలని స్థానిక ఎస్టీయూ నాయకులు కోరారు. ఈమేరకు వారు మంగళవారం ఈ దీక్షలకు సంబంధించిన పోస్టర్లను కూడా స్థానిక ఎంఈఓ ఆఫీస్ ఎదుట విడుదల చేశారు. ఎస్టీయూ జిల్లా నాయకుడు ఆదినారాయణ, స్థానిక ఎస్టీయూ నాయకులు పాల్గొన్నారు.